క్లుప్తంగా

జోరుగా ఉపాధి పనులు



పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని తంగెళ్లపురం చెరువు పూడికతీత పనులు 150 మంది కూలీలు పనులు చేస్తున్నారు. భూముల అభివృద్ధి, చెరువుకట్టపై చెట్టుపుట్టలను తొలగించడం వంటి పనులను చేస్తున్నారు. ఈ పనులు నెలరోజుల పాటు చేస్తామని ఫీల్డ్‌అసిస్టెంట్ హేమలత తెలిపారు. కూలీలకు రోజుకు రూ.200 కూలీ గిట్టుబాటు అవుతుంది. ఎండ వేడిమి ఉన్న కూలీలు పనులను హుషారుగా చేస్తున్నారు. సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో ఇక్కట్లు



బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కారణంగా ఆగిన వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్‌తో వాహనాలు నిలిచిపోతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఆటోవాలాలు ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని వాహనాలుదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: మండలంలోని వెదురుపట్టు సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శనివారం రాత్రి బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన రాము, సురేష్ శనివారం వెదురుపట్టు రాజుపాళెం గ్రామంలో మేస్త్రీ పనులు చేశారు. రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. వెదురుపట్టు సమీపంలో రోడ్డు మీద ఉన్నట్టుండి కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఇద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు ఆటోలో శ్రీకాళహస్తికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శీతలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శీతలాంబ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శీతలాంబ దేవతకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఏటా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

బోర్డు ఒక చోట.. కౌంటర్ మరోచోట



పీఆర్‌వో కార్యాలయం పక్కన ఖాళీగా దర్శనమిస్తున్న కౌంటర్, బోర్డు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల చర్యలు విడ్డూరంగా ఉంటాయి. ఓంకార స్వామి మఠం వద్ద పీఆర్వో కార్యాలయాన్ని, రూ.200 ప్రత్యేక కౌంటర్‌ను ఆలయ అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. ఇటీవల పీఆర్వో కార్యాలయాన్ని అక్కడే ఉంచి, రూ.200 టికెట్ కౌంటర్‌ను మాత్రం ధూర్జటి గ్రంథాలయం వద్దకు మార్పు చేశారు. అయితే పీఆర్వో కార్యాలయం వద్ద రూ.200 టికెట్ కౌంటర్‌ను, బోర్డును అలాగే ఉంచేశారు. దీంతో భక్తులకు అయోమయానికి గురవుతున్నారు. ఆ కౌంటర్‌లో ఎవరూ ఉండరు. వచ్చిన భక్తులు కాసేపు నిరీక్షించి, ఆ తరువాత విషయం తెలుసుకుని వెళ్లిపోతున్నారు.





తొలకరి నాట్లు

తొలకరి జల్లులు పలకరించడంతో రేణిగుంట మండలంలో జోరుగా వరినాట్లు మొదలయ్యాయి. ముఖ్యంగా వ్యవసాయ బోర్ల కింద ఉన్న పంట పొలాల్లో 20 రోజుల నుంచి దుక్కులు దున్ని వరినాట్లు నాటుతున్నారు. గత సీజన్‌లో నియోజకవర్గంలో అధికంగా వరి సాగు చేసి మంచి దిగుబడిని రైతులు పొందారు. గత సీజన్‌లో ఓ బస్తా వరిధాన్యం రూ.2వేలకు పైగా ధర పలికింది. ఈ ధాన్యాన్ని వ్యాపారులు అధికంగా కొనుగోలు చేయడంతో రైతులు లాభాలు గడించారు. దీంతో ఈసారి కూడా రెట్టించిన ఉత్సాహంతో బోర్ల కింద పొలాల్లో వరినాట్లు మొదలు పెట్టారు. అయితే ప్రస్తుత సీజన్‌లో కూలీల సమస్య రైతులకు తలనొప్పిగా మారింది. తొలకరి వర్షాలు కురుస్తాయన్న ఆశతో మరి కొంత మంది రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

–రేణిగుంట

వైభవంగా ముత్యాలమ్మ దంపతుల ఊరేగింపు





కీళపూడిలో ఊరేగుతున్న ముత్యాలమ్మ, ముత్యాలయ్య. కీళపూడిలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

- నేడు అగ్నిగుండ ప్రవేశం

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో ముత్యాలయ్య, ముత్యాలమ్మ దంపతుల ఊరేగింపు శనివారం వైభవంగా సాగింది. గ్రామంలో ముత్యాలమ్మ కొలుపులో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. అనంతరం ముత్యాలయ్య, ముత్యాలమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై పురవీధుల్లో ఊరేగించారు. డప్పులమోత, మంగళ వాయిద్యాలు, బాణసంచా మోతల నడుమ ఊరేగింపు సందడిగా సాగింది. స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు, కొబ్బరికాయలు కొట్టి ప్రజలు స్వాగతం పలికారు. పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ముత్యాలమ్మ కొలుపును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పాలు పద్మనాభం మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

సత్యవేడుకు చేరిన నోటు పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం 27,650 నోటు పుస్తకాలు సరఫరా చేసింది. శనివారం ఎంఈఓ కే.రవి, ఎంఈఓ2 కే.ఉషా కలసి లారీలో వచ్చిన పుస్తకాలను గురుకుల బాలుర పాఠశాల గదుల్లో భద్రపరిచారు. మండల పరిధిలోని యూపీ స్కూల్ 5, ఉన్నత పాఠశాలలు 9, 2 బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పంపిణీ జరుగుతుందన్నారు. త్వరలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీఆర్పీలు, మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

నాగలాపురం: మండలంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం శ్రీ వాసవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం కన్యకా పరమేశ్వరి, వాసవీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామి, అమ్మవారిని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి మంగళ వాయిద్యాలతో బాణసంచాలతో తిరువీధి ఉత్సవం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సుగుణరాముడు, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, నారాయణ, రమేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లాభాలు పూయిస్తున్న మల్లెలు



లాభాలు పూయిస్తున్న మల్లెలు



తిమ్మాపురంలో మల్లె పూలు కోస్తున్న కూలీలు

- పుత్తూరు ప్రాంతంలో అధికంగా పూలతోటల సాగు
- మార్కెట్‌లో తప్పని దళారుల బెడద
- నష్టపోతున్న అన్నదాతలు

పుత్తూరు: పుత్తూరు ప్రాంత రైతులకు మల్లెలు లాభాలు పూయిస్తున్నాయి. మల్లెసాగు లాభదాయకంగా ఉండడంతో ఈ తోటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. అధిక పెట్టుబడుల అవసరం లేకుండా ఏడాదిలో ఏడెనిమిది నెలల పాటు నిరంతరం ఆదాయాన్ని అందిస్తున్న ఈ మల్లెతోటలు పుత్తూరు మండలంలో ఏటా విస్తరిస్తున్నాయి. కొత్తగా సాగు చేసిన తోట ఒసారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడిని ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కలు నాటిన తర్వాత తగిన మోతాదులో ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. మొగ్గలు వచ్చే సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు వరకు ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఈ తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతల వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులు ధీమాగానే ఉంటారు. మల్లెపూల సీజన్ మార్చి నెలతో మొదలై అక్టోబర్ వరకు ఉంటుంది. మల్లెలు మాత్రం ఏప్రిల్ చివరి వారం నుంచి పూయడం మొదలవుతాయి. తొలి మూడు మాసాల్లో ఒక కేజీ రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతుంది. పూలు కోయడానికి వచ్చే కూలీలకు కేజీకి రూ.20 చెల్లిస్తుంటారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్, తిమ్మాపురం, పిళ్లారిపట్టు, కల్యాణపురం, వినాయకపురం ప్రాంతాల్లో మల్లె తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. అయితే తాము పండించిన పూలకు తామే ధర నిర్ణయించే స్థితిలో లేకపోవడం పట్ల పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని దళారుల దోపిడీ..

అన్ని మార్కెట్లకు ఉన్నట్లే పూల మార్కెట్‌లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. పుత్తూరు లో ముగ్గురు పూల వ్యాపారులు ఉన్నారు. వీరు పల్లెల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలు కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో రైతుకు ధరను చెప్పకుండా, ఒక పుస్తకంలో ఎన్ని కేజీలు కొనుగోలు చేశారో నమోదు చేస్తారు. నెలకోసారి మొత్తం డబ్బు చెల్లిస్తారు. మల్లెల సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధరను చెల్లిస్తుండడంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. ఈ దళారులు మా త్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ వ్యవస్థను రూపుమాపి పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


అలరించిన ఆధ్యాత్మిక ఉపన్యాసం



ప్రసంగిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త కందాడై సెల్వం

వరదయ్యపాళెం: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహితీ వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణం ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమం సభికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఉపన్యాసకులుగా విచ్చేసిన శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు, ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త కందాడై సెల్వన్ సీతారాముల కల్యాణం ప్రాముఖ్యత, ప్రాశస్త్యం, గొప్పదనం గురించి వివరించారు. సీతారామ కల్యాణ ఘట్టాన్ని ప్రస్తుత సామాజిక పరిస్థితులతో అన్వయిస్తూ, మారుతున్న పరిస్థితులు, విపరీత పోకడలపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాలకు చెందిన పలువురు ఆధ్యాత్మిక సాహిత్య ప్రియులు పాల్గొన్నారు. శ్రీసిటీ పీఆర్వో వల్లేటి బాలాజీ కార్యక్రమ ప్రయోక్తగా వ్యవహరించారు.

చురుగ్గా పర్యాటక అభివృద్ధి పనులు



చురుగ్గా సాగుతున్న వ్యూటవర్ నిర్మాణ పనులు

పిచ్చాటూరు: పిచ్చాటూరులోని వైఎస్సార్ జంక్షన్ సమీపంలో జరుగుతున్న అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జలాశయానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తుడా సంస్థ ద్వారా పర్యాటకానికి రూ.1.85 కోట్లను తొలి విడతగా మంజూరు చేసింది. ఇందులో వ్యూటవర్, బోటింగ్ జెట్టీ, చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే జలాశయం గతంలో చిత్రపరిశ్రమలకు నిలయంగా మారుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు.

ఉజ్వల భవితకు పునాది ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తి కాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లు జరుగుతున్నాయి సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి. ఐటీఐలు కావాల్సినంత భరోసా ఇస్తూ బంగారు భవితకు బాటలు వరుస్తున్నాయి. ఐటీఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెళకువలపై పట్టు సాధిస్తుండడంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు

జిల్లాలోని పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కో కోర్సుకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రత్యేకత చాటుకుంటుంది. కార్వేటినగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానికల్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి కోర్సులు చేసిన విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొంది స్థిరపడ్డారు.

కోర్సు మధ్యలోనే ఆన్ జాబ్ ట్రైనింగ్..

విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్ జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదువుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వంటి ప్రముఖ నగరాల్లోని వివిధ సంస్థలో మూడు నెలలు, ఆరు నెలలు వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టైఫండ్‌గా కొంత మొత్తం చెల్లిస్తుండడం గమనార్హం. కోర్సు పూర్తయిన తర్వాత అవే సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడాలనే సంకల్పంతో ఈ పద్ధతిని తీసుకొచ్చినట్లు తెలిసింది. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 264 మంది ఓజేటీకి వెళ్లారు.

కోర్సులు ఇవే..

కోపా (ఏడాది కోర్సు), మ్యాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్(రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్(రెండేళ్లు, ఫిట్టర్(రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్(రెండేళ్లు), మెకానికల్ డీజిల్ (ఏడాది.) టర్నర్(రెండేళ్లు), వైర్‌మెన్(రెండేళ్లు), వెల్డర్(ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్(రెండేళ్లు), డ్రెస్‌మేకింగ్(ఏడాది), ప్లంబర్(ఏడాది), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(రెండేళ్లు), ఐసీటీఎస్ఎం(రెండేళ్లు) మెషినిస్ట్(రెండేళ్లు) ఉంటుంది.

మెళకువలు నేర్చుకున్నా..



ఎలక్ట్రీషియన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నా. నేను అమరరాజా కంపెనీలో ఓజేటీకి వెళ్లి నేను తీసుకున్న ఎలక్ట్రీషియన్ కోర్సులో కొన్ని మెళకువలు నేర్పించారు. కోర్సుతో పాటు నెలకు రూ.5 వేలు స్టైఫండ్ ఇచ్చారు.

–జ్ఞానేశ్వర్, ఎలక్ట్రీషియన్ విద్యార్థి, కార్వేటినగరం ఐటీఐ

రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చారు..



నేను ఎలక్ట్రానిక్ మెకానిక్ రెండో సంవత్సరం చదువుతున్నా. చెన్నైలోని సుందరం ఫాస్టనర్స్ లిమిటెడ్ కంపెనీలో ఓజేటీకి వెళ్లా. కర్మాగారంలో స్పేర్‌పార్ట్స్ తయారు చేయడం నేర్చుకున్నా. నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చా.

–ఆర్.జీ జగదీష్, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం

డ్రెస్ మేకింగ్ నేర్చుకున్నా



కార్వేటినగరం ఐటీఐలో డ్రెస్ మేకింగ్ నేర్చుకున్నా ఏడాదికి పూర్తిస్థాయిలో నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటి వద్దనే నేర్చుకున్న డ్రెస్ మేకింగ్‌తో ఆర్థికంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఐటీఐ కోర్సు వల్ల నా కుటుంబాన్ని పోషించుకునే ఆదాయాన్ని పొందుతున్నాను.

–దీక్షిత, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం

ఉజ్వల భవిత అందించాలనే సంకల్పం



ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్‌ల పాఠాలతో పాటు భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చాలామంది మా విద్యార్థులు పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరం.

–పి.గణేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కార్వేటినగరం

పెట్రోలు, డీజిల్ బాటిళ్లలో విక్రయించరాదు

ఏర్పేడు: మండలంలోని పెట్రోలు బంకుల యజమానులు ఎన్నికల నియమావళి ముగిసేంత వరకు వినియోగదారులకు విడిగా బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ విక్రయించరాదని ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ నెల 18 నుంచి జూన్ 16 వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.

శ్రీకాళహస్తి: పెట్రోల్, డీజిల్‌ను విడిగా విక్రయించవద్దని రెండవ పట్టణ సీఐ రారాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ఎవరికీ బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్‌ను విక్రయించకూడదన్నారు. విధ్వంస చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ నిబంధనలు విధించినట్లు తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

25న మండల మీట్

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిద్దయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా, వైద్య, ఆరోగ్య శాఖలపై సమీక్షించనున్నట్లు వివరించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.